క్లుప్తంగా

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతూ స్పందనలో డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. విజయవాడ, హైదరాబాదు వంటి నగరాల్లో సంవత్సరాల తరబడి కోచింగ్ తీసుకుంటూ కాలం వెల్లబుచ్చుతున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు షాకీర్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్ల వేతనాలు చెల్లించాలి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పని చేస్తున్న క్లాప్ డ్రైవర్లకు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ కోరారు. సోమవారం జేసీ గణేష్‌కుమార్‌కు ఈ మేరకు విన్నవించారు. క్లాప్ డ్రైవర్లకు వేతనాలు ఇవ్వాలన్న ఆలోచనే మున్సిపల్ కమిషనర్‌కు లేదని ఆరోపించారు. కార్మికులు అడుగుతున్నా కమిషనర్ పట్టించుకోవడం లేదని తెలిపారు. అప్పులు చేసి జీవనాన్ని కొనసాగించడం డ్రైవర్లకు కష్టతరంగా మారిందని చెప్పారు. కమిషనర్ లేదా రెడ్డి ఏజెన్సీ వేతనాలు ఇవ్వాలని కోరారు. తాను కమిషనర్‌తో మాట్లాడి వేతనాలు అందించేలా చూస్తానని జేసీ అన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న సాయి యువజన సేవా సంఘం అధ్యక్షుడు ఎం. చంద్రశేఖర్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కార్తీక మాసంలో అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని శ్రీ సాయి యువజన సేవా సంఘం అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం పాతరిమ్స్‌లోని ఆదరణ నిరాశ్రయుల వసతి గృహంలో కడప తిరుమల టింబర్ డిపో ప్రొప్రైటర్ కె.గోపీక్రిష్ణ, సూర్య డెవలపర్స్ ప్రొప్రైటర్ కె.సురేంద్రనాథ్ సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు శంకరాపురం అశోక్, వలీబాషా, డి.సుబ్బరాయుడు, మాధవరెడ్డి, శివశంకర్ పాల్గొన్నారు.

'అమర్ సైనిక్' సర్కిల్‌ను అభివృద్ధి చేయాలి

కడప రూరల్ : కడప నగరం ఎర్రముక్కపల్లె కూడలిలో గల అమర్ సైనిక్ సర్కిల్‌ను అభివృద్ధి చేయాలని జిల్లా ఎక్స్ సర్వీస్ మెన్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు జక్క ఫిలిప్స్ కోరారు. ఆ మేరకు సోమవారం కడప నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం పిలిఫ్స్ మాట్లాడుతూ కడప నగరంలోని పలు కూడాళ్లు ఆకర్షణీయంగా తయారు కావడం అభినందనీయమన్నారు. ఆ కూడళ్ల తరహాలోనే అమర్ సైనిక్ సర్కిల్‌ను కూడా అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగరంలోని కూడళ్లలో అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యామ్నాయ రోడ్డు మార్గాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవీ సుబ్బారెడ్డి, కేసీ బాదుల్లా పాల్గొన్నారు.

నాణ్యతగా పనులు చేపట్టాలి



కృష్ణా సర్కిల్‌లో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కడప నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతగా చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతంరెడ్డి పేర్కొన్నారు. నగరంలో జరుగుతున్న సర్కిళ్ల సుందరీకరణ పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, సీనియర్ నాయకులు వెంకటరమణారెడ్డి, రాష్ట్ర లేబర్ సెల్ అధ్యక్షులు పుల్లయ్య, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు పటాన్ మహమ్మద్ అలీఖాన్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ఖాదర్ ఖాన్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ బాబు, ఓబీసీ జిల్లా అధ్యక్షులు చిన్న కుల్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

దీపం.. జ్ఞాన స్వరూపం

కడప కల్చరల్ : కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో సందడిగా మారాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామి దర్శనం కోసం ఆలయాల వెలుపల వేచి ఉన్నారు. ఆలయాలలో స్వామి మూల విరాట్‌లకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలను నిర్వహించారు. వేదపండితులు లింగాష్టకం ఆలపిస్తుండగా, స్వామి, అమ్మవార్లకు విశేష అలంకారాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 5 గంటల నుంచి భక్తులను దర్శనాలకు అనుమతించారు. భక్తులు క్యూ లైన్లలో వేచి ఉండి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

మళ్లీ పవిత్రమైన కార్తీక మాసం, అందులో మరింత పుణ్యదాకమైన పౌర్ణమినాటి వరకు తమ కుటుంబాలను చల్లగా చూడాలని శివయ్యను మనసారా ప్రార్థించారు. ఆలయాల ప్రాంగణాలలోని బిల్వ వృక్షాలు, ఉసిరి చెట్లకు పూజలు నిర్వహించారు. కడప నగరంలోని మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పలు రకాల దీపాలను వెలిగించారు. మోచంపేట శ్రీ ప్రసన్న విశ్వేశ్వర స్వామి ఆలయంలో అభిషేకం నిర్వహించారు. గడ్డి బజారులోని శ్రీ సోమసుందరేశ్వరస్వామి ఆలయంలో శివునికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కడప నగర గ్రూప్ టెంపుల్స్ ఈఓ శ్రీధర్ పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

శ్రీ సర్వేశ్వరాశ్రమంలో..

స్థానిక కేంద్ర కారాగారం వద్ద గల శ్రీ సర్వేశ్వర మహర్షి ఆశ్రమంలోని పార్వతీ పరమేశ్వరులకు విశేష పూజలు నిర్వహించారు. కార్తీకమాసం, సోమవారంతో మాస శివరాత్రి కూడా కలిసి రావడం శుభదాయకంగా భావించి భక్తులు రెట్టించిన భక్తితో పూజలు చేశారు. తొలుత స్వామికి రుద్రాభిషేకం, శ్రీ రాజరాజేశ్వరీమాతకు కుంకుమార్చన తదితర పూజలు చేశారు. ఆశ్రమ సేవా సమితి అధ్యక్షులు ఎస్.రాధాకృష్ణమూర్తి, కార్యవర్గ సభ్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. స్థానిక ప్రముఖులు కేఎస్ రఘునాథ్, ఎస్.రంగనాయకులరావు, జి.ఉమామహేశ్వరరావు, కె.విజయానందరెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

■ కడప నగరం హనుమప్పవీధిలోని శ్రీ భద్రావతి భావనారుషి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆమంచి శ్రీనివాసులు పర్యవేక్షణలో స్థానిక మహిళలు సామూహిక పూజల్లో పాల్గొన్నారు. విశేష అలంకారంలోని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.



విశేష అలంకారంలో శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో శ్రీ సోమసుందరేశ్వరుడు



శ్రీ సర్వేశ్వరాశ్రమంలో పార్వతీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న భక్తులు



మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



హనుమప్పవీధిలోని శ్రీ భద్రావతి భావనారుషి ఆలయంలో కార్తీక దీపాలతో భక్తులు

కార్తీకం.. ఆరోగ్యదాయకం

కడప కల్చరల్ : కార్తీక మాసాన్ని శివ వైష్ణవ భక్తులు అత్యంత పవిత్రమైనదనిగా భావిస్తారు. అటు శివునికి, ఇటు విష్ణువుకు ఇష్టమైన ఈ మాసంలో పూజలు నిర్వహించడం పుణ్యదాయకమని వారి విశ్వాసం. తెల్లవారుజామునే నదీ స్నానాలు చేయడం, వన భోజనాలు, ఉసిరి చెట్ల కింద భోజనం చేయడం తదితరాలు ఈ మాసంలోని ప్రత్యేకతగా భావిస్తారు. నిజానికి ఈ సంప్రదాయాలు అటు సామాజికంగా, ఇటు శారీరకంగా ఎంతో ఉపయుక్తమైనవని పెద్దలు చెబుతారు. ఈ సంప్రదాయాల వెనుక ఆరోగ్యపరమైన విశేషాలు ఎన్నో ఉన్నాయని తెలుస్తోంది. వివరాలిలా ఉన్నాయి.

కార్తీక మాసానికి ముందు వరకు కురిసే వర్షాలతో ఊరి బయట మైదానాలలో పచ్చిక పెరిగి ఉంటుంది. కొండ కోనలు, అక్కడి భారీ వృక్షాలు, పొదలు, మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతుంటాయి. వీటిలో కొన్ని ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. నదుల ఒడ్డున ఉండే చెట్లు, మొక్కలు కూడా ఆరోగ్యంగా ఎదిగి ఉంటాయి. నదీజలం వాటిని ఒరుసుకుని వచ్చేటపుడు ఆ నీటికి ఔషధ గుణం లభిస్తుంది. నదీ జలాలలో సూర్యోదయానికి ముందే స్నానం చేయడం పలు చర్మ వ్యాధుల నుంచి రక్షిస్తుందని తెలుపుతారు. ఈ ప్రక్రియ శారీరక సమతౌల్యానికి ఉపయోగపడుతుందని పేర్కొంటారు. ఈ మాసంలో పగలంతా ఎండ చురుక్కుమంటూ ఉంటుంది. ఎండకు కాగిన నదుల్లోని నీరు రాత్రి చలికి చల్లబడుతుంది. దీంతో ఆ నీటికి కాచి చల్లార్చిన గుణం ఉంటుంది గనుక ఇలాంటి నీటిలో స్నానం చేయడం శుద్ధ, ఔషధ జలంతో స్నానం చేసిన ఫలితం లభిస్తుంది.

ఆధ్యాత్మికతత్వం

వర్షా కాలం సందర్భంగా కొండ కోనల్లో దండిగా నీరు చేరి లోయల్లోకి అటు నుంచి నదుల్లోకి వస్తుంది. సెలయేరు రూపంలో అటవీ ప్రాంతంలోని ఔషధ మొక్కలను ఉరుసుకుని ఔషధ గుణాలతో వచ్చే నీరు నదుల్లో కలుస్తుంది. నదులు చివరికి సముద్రుడిని చేరతాయి. దీన్ని మానవ జీవితం ఆరోగ్యపరంగా కూడా పెద్దలు విశ్లేషిస్తారు. మనిషి ఎంత గొప్పస్థాయిలో పుట్టినా.. అంతకంటే గొప్పగా జీవించినా చివరికి ఆధ్యాత్మిక చింతనతో దైవ కృప కోసం ప్రయత్నిస్తాడు. దైవ సన్నిధికి చేరుకోవడమే పరమావధిగా భావిస్తాడు. కార్తీక సంప్రదాయాల్లో ఈ తత్వం దాగి ఉంది.

ఉసిరి ప్రాధాన్యత

ఈ మాసంలో ఉసిరి కాయలు ఎక్కువగా లభిస్తాయి. ఆయుర్వేద పరంగా ఉసిరిని ముఖ్యమైనదిగా భావిస్తారు. ఈ మాసంలో ప్రతి సోమవారం ఉదయం, సాయంత్రం శివాలయ ప్రాంగణాలలో కార్తీక దీపాలలో భాగంగా ఉసిరి దీపాలను కూడా వెలిగిస్తారు. ఉసిరిని ఆరోగ్య సిరిగా కూడా భావిస్తారు. ఉసిరిలో పుష్కలంగా సి–విటమిన్ ఉంటుందని, దాన్ని ఆహారంగా స్వీకరిస్తే రోగ నిరోధకశక్తి పెరుగుతుందని పెద్దలు చెబుతారు. ప్రతిరోజు కనీసం ఒక్క ముద్ద అన్నంలో ఉసిరికాయ లేదా ఉసిరి పచ్చడితో తింటే శారీరక అనారోగ్యాలు తగ్గుతాయంటారు. ఉసిరికి నోటి పూతను తగ్గించే గుణం ఉంది. తల వెంట్రుకలు బాగా పెరగాలన్నా.. శిరోజాల ఆరోగ్యం బాగుండాలన్నా.. ఆమ్ల ఆయిల్ (ఉసిరి నూనె) వాడటం మంచిదంటారు. ఈ సీజన్‌లో వచ్చే శీతవాతాలు, కఫ, శ్లేష్మ, పిత్త దోష నివారణ ఉసిరి వాడకంతో తగ్గుతుంది. కానీ ఉసిరి కాయను రాత్రి పూట తినకూడదని కూడా పెద్దలు హెచ్చరిస్తున్నారు.

ఐక్యత పెంచేందుకు..

రోజురోజుకు మానవ సంబంధాలు తగ్గిపోతున్న ఈ రోజుల్లో కార్తీక మాసంలో లభించే వన భోజనాల అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని మానవతా వాదులు సూచిస్తున్నారు. బంధుమిత్రులు, హితులు, స్నేహితులు ఒక చోట కూడి ఉదయం నుంచి సాయంత్రం అందరూ కలిసిమెలిసి ఆనందంగా గడుపుతూ ఆత్మీయతను పెంచుకునే అవకాశం వన భోజనాల ద్వారానే లభిస్తుందంటారు. ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు లాంటి కృత్రిమ వాతావరణానికి అలవాటు పడిన నేటి ప్రజలు సంవత్సరంలో కనీసం ఇలాంటి సందర్భాల్లోనైనా ఆరుబయట సహజమైన వాతావరణం, గాలి, వెలుతురులను ఆస్వాదించాలని సూచిస్తున్నారు. నేటి బిజీ జీవితాలలో ఒకరికొకరు కనీసం ఐదు నిమిషాలైనా తీరిగ్గా మాట్లాడి వారి మంచి చెడులను తెలుసుకునేందుకు కూడా వన భోజనాలు తోడ్పడతాయి. సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి అయినా వ్యక్తులు మానసికంగా రోజురోజుకు దూరమవుతున్నారు. అలాంటి లోటును వన భోజనాలు తీరుస్తాయి. రోజంతా అందరూ ఒకచోట కలిసి ఒకరినొకరు సమస్యలను తెలుసుకుని పరిష్కారాలను ఆలోచించే అవకాశం లభిస్తుంది. ఈ కార్యక్రమం తర్వాత వ్యక్తుల్లో మానసికంగా, శారీరకంగా కొత్త ధైర్యం లభించినట్లు అనిపిస్తుంది. వన భోజనాల కోసం ఆరుబయలు ప్రదేశాలకు వెళ్లడం పరిపాటి. ఇటీవల కురిసిన వర్షాలకు చెట్లు, మొక్కలు శక్తివంతంగా, రసవంతంగా పెరుగుతుంటాయి. వాటి పూర్వాకులు, కొమ్మలు, రెమ్మలు, పుష్పాడి పైనుంచి వీచే గాలిలో సేద తీరడం శరీరానికి కొత్త ఉత్తేజాన్ని అందించగలదని ఆయుర్వేద నిపుణులు పేర్కొంటున్నారు.

యేసయ్య రాకను తెలుపుతూ..

నగరంలో తళుక్కుమంటున్న తారలు

కడప కల్చరల్ : క్రైస్తవ లోకానికి అత్యంత ఆరాధనీయమైన కరుణామయుని జయంతి క్రిస్మస్ వేడుకలు సమీపించాయని నగరంలో వెలుగుతున్న క్రిస్మస్ స్టార్‌లు చాటి చెబుతున్నాయి. ఈ పండుగకు మరో 12 రోజుల గడువు ఉంది. కానీ క్రైస్తవ లోకం ఇప్పటికే రోజూ సాయంత్రం వేళల్లో చర్చిలకు వెళ్లి పండుగకు అవసరమైన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. చర్చిలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. తమ ఇళ్లను సైతం నూతనంగా మార్చుకునేందుకు అవసరమైన అలంకారాలు చేస్తున్నారు.

చర్చి కమిటీలు, నిర్వహణ కమిటీలతో కలిసి ఏర్పాట్లు చేస్తున్నారు. క్రిస్మస్ పర్వదినానికి వారం ముందు నుంచి డిసెంబర్ 31 వరకు చర్చిల ప్రాంగణాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి స్త్రీ, పురుషులు, వృద్ధులు, బాలలకు ప్రాతినిధ్యం కలిస్తూ కరపత్రాలను రూపొందిస్తున్నారు. పలు చర్చిల వద్ద, క్రైస్తవుల ప్రాబల్యం గల వీధి కూడళ్లలోనూ, చర్చిల వద్ద ఇప్పటికే భారీ క్రిస్మస్ స్టార్‌లను ఏర్పాటు చేశారు. రాత్రులు ఇవి శోభాయమానంగా వెలుగులీనుతూ ఏసయ్య రాకను తెలియజేస్తున్నాయి. ఈ ఏర్పాట్లు 12 రోజుల ముందుగానే క్రిస్మస్ వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. చర్చిల్లోని మత పెద్దలు తమ చర్చిల పరిధిలోని భక్తుల గృహాలకు వెళ్లి క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. క్రిస్మస్‌కు రెండు రోజుల ముందు నుంచి భక్తి పూర్వక సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించేందుకు యువకులు, బాలలు జోరుగా సాధన చేస్తున్నారు.



నగరంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్

ఆ వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న బీసీ సంక్షేమ హాస్టళ్లలోని కొందరు వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కన్నెలూరు శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం కడపలోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో కొందరు బీసీ బాలుర ప్రీమెట్రిక్ హాస్టల్, పోస్టు మెట్రిక్ హాస్టల్‌లలో పిల్లలు లేకపోయినా విద్యార్థుల హాజరు నమోదు చేసి బిల్లులు చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, నగర నాయకులు ఆజాద్, సోహెల్ పాల్గొన్నారు.

విజిలెన్స్ సీఐపై దాడి చేసిన వారిని శిక్షించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాయచోటి విజిలెన్స్ సీఐపై కడప నగరంలో దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఆపు బాబు నాటకం.. జగనన్నే మా నమ్మకం

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా
- 36, 22 డివిజన్లలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం



36వ డివిజన్‌లో సంక్షేమ పథకాల బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ప్రతిపక్షనేత చంద్రబాబు ఆడే నాటకాలను నమ్మడానికి ప్రజలు విశ్వసించడం లేదని, సీఎం వైఎస్ జగన్‌పైనే వారు నమ్మకం ఉంచారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక 36, 22 డివిజన్లలోని అగాడి, మారుతీనగర్‌లలో అక్కడి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జులు ఎస్‌ఎండీ రఫీ, రామచంద్రయ్యల ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఇంకా అభివృద్ధి చెందాలంటే, మనందరి కుటుంబాలు బాగుపడాలంటే మళ్లీ జగన్ ప్రభుత్వం రావాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజలకు అందించడం జరిగిందన్నారు. పేద ప్రజల కోసం రైతు భరోసా, రైతు భరోసా కేంద్రాలు, ఉచిత పంటల బీమా, ఆరోగ్యశ్రీ, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం, నాడు నేడు ఆరోగ్యం, ఫీజురీయింబర్స్‌మెంట్, అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, పెన్షన్ కానుక, ఇళ్ల నిర్మాణం, సచివాలయం, వలంటీర్లు, జల యజ్ఞం, జగనన్న భూహక్కు భూ రక్ష తదితర ఎన్నో కార్యక్రమాల ద్వారా పేద ప్రజలకు మేలు చేశారన్నారు. జగనన్న వస్తేనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భవిష్యత్తు అని అన్నారు. పేదలు గెలిచే వరకు వారి జీవితాలు బాగుపడే వరకు ఈ యుద్ధం సాగుతూనే ఉంటుందని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలను విస్మరించి, వారి ఇష్టారాజ్యంగా పాలన చేయడం జరిగిందని అన్నారు. జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాల క్యాలండర్‌ను రూపొందించి ప్రజల చెంతకు పథకాలను అందించడం జరుగుతోందని అన్నారు. కరోనా సమయంలో టీడీపీ నాయకులు ఎవరు కూడా ప్రజలకు అందుబాటులో లేరని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మాత్రమే ప్రజలకు సేవలందించారని తెలిపారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగనన్న అన్న సంక్షేమ పథకాల ఫ్లెక్సీని, 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' అనే బుక్‌లెట్‌లను ఆవిష్కరించారు. అనంతరం సమీపంలోని చిన్న పిల్లల పార్క్‌ను సందర్శించి ఆట పరికరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చెన్నయ్య, షఫీ, కో ఆప్షన్ సభ్యుడు హరూన్ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పవర్ అల్తాఫ్, ఎస్.సుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కమాల్ బాషా, టీపీ వెంకట సుబ్బమ్మ పాల్గొన్నారు.

ఎంజే కుంటలో..

కడప నగరంలోని 11వ డివిజన్ మృత్యుంజయ కుంటలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ అధ్యక్షుడు తోట క్రిష్ణ, కన్వీనర్ మల్లికార్జున, స్థానిక ఇన్‌చార్జి భాస్కర్ పాల్గొని వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్టికను ప్రదర్శించారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకతను వివరించారు.

ఎల్లో గ్యాంగ్ విష ప్రచారాలను తిప్పికొట్టాలి

బద్వేలు అర్బన్ : పేదల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ విష ప్రచారాలు, ఎల్లో మీడియా అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, కడప మేయర్ కె.సురేష్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని ఎస్‌ఆర్‌ఎస్‌టీ ఫంక్షన్ హాలులో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమావేశంలో ఆయన ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలతో కలిసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయసాధన కోసం పుట్టిందే వైఎస్సార్‌సీపీ అన్నారు. ఏళ్ల తరబడి ప్రజల మధ్య తిరిగి అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తూ ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేశారన్నారు. దీన్ని ఓర్వలేని టీడీపీ నాయకులు, వారికి అండగా నిలిచిన ఎల్లోమీడియా దుష్ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని చెప్పారు. వాటన్నింటిని తిప్పికొట్టాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులపై ఉందన్నారు. అలానే సంక్షేమాభివృద్ధిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, పీఆర్‌ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు పి.నాగార్జునరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, కుడా చైర్మన్ గురుమోహన్, వైఎస్సార్‌సీపీ సోషల్‌మీడియా జిల్లా కన్వీనర్ వివేకానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌బాబు

కేఎంసీలో కొత్త వాహనాల ప్రారంభం

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థకు కొత్తగా వచ్చిన వాహనాలను మేయర్ సురేష్ బాబు, డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం, కమిషనర్ ప్రవీణ్‌చంద్ ప్రారంభించారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద రూ.29.50 లక్షలతో కొనుగోలు చేసిన స్కై లిఫ్ట్, చెత్త రవాణాకు ఉపయోగించే రూ.35 లక్షల కాంపాక్టర్, ఒక్కొక్కటి రూ.30 లక్షల విలువ గల 7 గల్ఫర్ మిషన్లను వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కొత్తగా కొనుగోలు చేసిన స్కై లిఫ్ట్ 13 మీటర్ల ఎత్తులో ఉన్న లైట్లను కూడా మరమ్మతు చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం చెత్త ఎత్తే కాంపాక్టర్లకు తోడు మరొకటి వచ్చిందన్నారు. నగర ప్రజలకు నిర్ణీత ధరలతో సేవలందించడానికి ఏడు గల్ఫర్ మిషన్లను తేవడం జరిగిందని, ఒక్కొక్కటి రూ.30 లక్షలు విలువ గల ఈ మిషన్లను లబ్ధిదారులకు 50 శాతం రాయితీకి అందించడం జరిగిందన్నారు. ఒక టోల్ ఫ్రీ నంబర్ కేటాయించి, ఆ నంబర్‌కు కాల్ చేసే వారికి కనీస ధరలకు వీరు సేవలందిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నాగేంద్ర, అజ్మతుల్లా, కో ఆప్షన్ సభ్యురాలు బండి మరియలు, రెడ్డిప్రసాద్, త్యాగరాజు, జమాల్‌వలీ, ఎంహెచ్‌ఓ చంద్రశేఖర్, ఏఈ మణిగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాహనాలను ప్రారంభిస్తున్న మేయర్ సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

కడప కార్పొరేషన్ : మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు వి.నరసింహులు, తారక రామారావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం మున్సిపల్ రంగంలో ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు జీపీఎఫ్ ఖాతాలు తెరిచి, సరెండర్ లీవులు ఇవ్వాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. పనిభారం తగ్గించాలని, ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఈశ్వరయ్య, కె.జాన్, వెంకటాద్రి, బి.రాజేష్, బాబు, మహేంద్ర, అంజి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు

అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

కడప కార్పొరేషన్ : ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని కేఎంసీ కమిషనర్ జీఎస్‌ఎస్ ప్రవీణ్ చంద్ ఆదేశించారు. సోమవారం కడప నగర పాలక సంస్థ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని సంబంధిత శాఖాధిపతులు, నగరపాలక సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికి కేటాయించిన పనులను వారు నిర్లక్ష్యం లేకుండా నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 55 అర్జీలు రాగా, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి–18, టౌన్ ప్లానింగ్ –19, రెవెన్యూ విభాగం–2, హెల్త్ విభాగం –5, యూపీఏ విభాగం –1, మెప్మా –1, సచివాలయ విభాగం–1, తహసిల్దార్ కడప–2, ఏపీఎస్పీడీసీఎల్ –1, డిస్ట్రిక్ ఎంప్లాయిమెంట్ విభాగం –1, హౌసింగ్ విభాగం –4 వచ్చాయి. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి న్యాయ పద్ధతిలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. గతంలో వచ్చిన అర్జీల పరిష్కరణ అనంతరం ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, డీసీపీ సూరజ్ కుమార్, ఈఈ నారాయణస్వామి, డీఈలు, ఏఈలు, ఆర్ఓలు పాల్గొన్నారు.



'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

ఆత్మహత్యలు వద్దు.. పోరాడి సాధించుకుందాం

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయుల సమస్యలపై ఆత్మహత్యలు వద్దు, పోరాడి సాధించుకుందామని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడపలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతపురం జిల్లా ఉపాధ్యాయుడు మల్లేశ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం బాధాకరం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఇలియాస్‌బాషా, రాష్ట్ర మున్సిపల్ విభాగం కన్వీనర్ రవిశంకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు సురేష్‌బాబు, జిల్లా ఆర్థిక కార్యదర్శి మహబూబ్‌బాషా, కడప నగర అధ్యక్ష, కార్యదర్శులు సాధిక్ అలీ, సంజీవరాయుడు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి